క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పేరిట ఇటీవల ప్రారంభించిన కొత్త కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నట్టు కోర్స్ సమన్వయకర్త డాక్టర్ ఐబీ రాజు బుధవారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ మెడిక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (ఏహెచ్‌ఏ)ల సహకారంతో ప్రారంభించామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, ఆర్థిక అవసరం ఉన్న వారికి ఉపకార వేతనాలు (స్కాలర్ షిప్) అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత, ప్రవేశ వివరాలు, స్కాలర్ షిప్ తదితర సమాచారం కోసం పి.మల్లేశ్వరరావు 99488–77755 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


డీఎస్పీ వేణు గోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో మనం డబ్బులు చెల్లించడమే తప్ప విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండదని, ఒకవేళ ఉన్నా కేవలం రూ.5 వేలలోపే ఉంటుందని సైబర్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో వ్యాపారాలు, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట అపరిచితులు కాల్స్ చేసి అధిక లాభాలు వస్తాయని చెబితే నమ్మి మోసపోవద్దని వాటి జోలికి వెళ్లకూడదన్నారు. సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా కేటుగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అనంతరం స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు.

క్లూస్‌టీం విచారణ

నారాయణఖేడ్: మండలంలోని తుర్కపల్లిలో మంగళవారం ఇంటితాళాన్ని పగులగొట్టి ఇంట్లోని బంగారు నగలు, నగదు అపహరించిన ఘటనలో బుధవారం క్లూస్ టీం సందర్శించి విచారణ నిర్వహించింది. బద్దలు కొట్టిన తాళం, బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించింది. సీఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి బాధితులను అడిగి వివరాలు సేకరించారు. త్వరలో కేసును ఛేదిస్తామని సీఐ వివరించారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ


చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను బుధవారం తెల్లవారుజామున కమిషనర్ జగ్జీవన్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాజీవ్ చౌక్ వద్ద కార్మికుల హాజరును కూడా పరిశీలించారు. అనంతరం ప్రధాన చౌరస్తాల్లో ఊడుస్తూ రోడ్లు శుభ్రం చేయడం, చెత్తను సేకరించడం, ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించడాన్ని పర్యవేక్షించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్‌కు తగిన సూచనలు, సలహాలనిచ్చారు.

వ్యాధులపై అవగాహన


సమావేశంలో సీహెచ్‌ఓ సుదర్శన్‌ను సన్మానిస్తున్న వైద్యుడు, సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): సీజనల్ వ్యాధులపై ప్రలజకు అవగాహన కల్పించాలని న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యుడు అమృత్‌రాజ్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. వారు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు తాగు నీరు, ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన సీహెచ్‌ఓ సుదర్శన్‌కు వైద్యులు, వైద్య సిబ్బంది సన్మానించారు. సమావేశంలో సూపర్‌వైజర్ మార్త, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం


అవార్డులతో ఆర్టీసీ కార్మికులు

నారాయణఖేడ్: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల లక్ష్యం కావాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. బుధవారం స్థానిక డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాద రహిత, ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, కార్మికులకు అవార్డులు, జ్ఞాపికలను అందజేశారు. కండక్టర్ గోపాల్, మెకానిక్ భూమాగౌడ్ పదవీ విరమణ పొందగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంటీ నర్సింహులు, మెకానికల్ ఇంజనీర్ దశరథరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తం

నిధుల లేమితో సతమతం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- ఇబ్బందుల్లో ప్రజలు

డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధుల లేమితోపాటు ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తడి పొడి చెత్త సేకరించి వర్మి కంపోస్టు ఎరువు ద్వారా ఆదాయం గడించాలన్న లక్ష్యం కూడా నీరుగారుతోంది. అంతేకాకుండా పారిశుద్ధ్య కార్మికులు కొరతతో చెత్త నిర్వహణ సమస్యగా మారింది.


అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న డంపింగ్ యార్డు

హత్నూర (సంగారెడ్డి): అప్పటి కలెక్టర్ హనుమంతరావు, జిల్లా యంత్రాంగం రాత్రీపగలు శ్రమించి జిల్లాలో 647 పంచాయతీల్లో నిర్మాణాలను పూర్తి చేయించారు. ప్రస్తుతం పని భారం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా డంపు యార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. హత్నూర మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా అన్నింటిలో డంపియార్డులు నిర్మించారు. అప్పుడు నిధుల లేమి కారణంగా కొందరు సర్పంచ్‌లు పనులు ప్రారంభించేందుకు సుముఖత చూపించలేదు. కానీ నిర్మాణాలు పూర్తి చేయాలనే పై నుంచి ఒత్తిడి మేరకు అప్పులు చేసి మరీ నిర్మించారు. అయితే ఇళ్లలో సేకరించిన తడి పొడి చెత్తను యార్డులకు వేరు చేసి వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేసి విక్రయించాలి. అలా చేస్తే గ్రామాలు శుభ్రతంగా ఉంటాయి ఆయా పంచాయతీలకు కొంత ఆదాయం సమకూరుతుందని నాటి ప్రభుత్వం భావించింది. ఆరంభంలో అంతా సవ్యంగా సాగాయి. రానురానూ తడి పొడిగా వేరు చేయడానికి సరిపోయేంత మంది కార్మికులు లేక, నిధుల సమస్యలతో గ్రామపంచాయతీలు చేతులెత్తేశాయి. కాగా, సేకరించిన చెత్తను పాడు బడ్డ బావుల్లో, జనసంచారం లేని ప్రాంతాల్లో పడేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సర్కారు అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

భారం

పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో నిర్వహణ భారం ప్రత్యేక అధికారులకు అప్పగించారు. వాటి పరిధిలో వినియోగించే ట్రాక్టర్లకు నిర్ణీత సమయంలో ఈఎంఐలు కట్టకపోవడం, డీజిల్‌కు నిధులు కేటాయించలేక సతమతం అవుతున్నారు. పలు గ్రామపంచాయతీల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేస్తున్నారని, కొన్ని చోట్ల పూర్తిగా నిలిపేశారని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. దీంతో ఇళ్ల మధ్యన చెత్తాచెదారం పేరుకుని పోతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

విచారిస్తాం



గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి చెత్త పొడి చెత్త వేర్వేరు చేసేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డుల్లో చెత్త ద్వారా ఎరువుగా తయారు చేసి రైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని గ్రామాల్లో చెత్తను చెరువు కుంటలు, గుంతల్లో పారబోస్తుంది వాస్తవమే. : శంకర్ ఎంపీడీఓ హత్నూర


గుంతలను పూడ్చుతున్న జేసీబీ

రహదారికి మరమ్మతులు

జహీరాబాద్: అధ్వానంగా మారిన జహీరాబాద్–బీదర్ బైపాస్ రోడ్డుకు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. బుధవారం జేసీబీ సహాయంతో కంకర వేసి మరమ్మతు చేయించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చేశారు. అల్గోల్‌కు వెళ్లేందుకు సైతం ఇదే రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి, బురదమయంగా మారడంతో ప్రజలు, వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. దాతల సహకారంతో కంకర, మొరం తెప్పించి అర కిలోమీటరు మేర గుంతలను పూడ్చివేయించారు. దీంతో రాకపోకలు సవ్యంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, నాయకులు అక్బర్ హుసేన్, జి.మల్లారెడ్డి, జమీలుద్దీన్, బర్కత్ అలీ దగ్గర ఉండి రోడ్డును మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా వారికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

చిట్కుల్‌లో కొనసాగుతున్న బోనాల వేడుకలు


ఊరేగింపులో మధు ముదిరాజ్

పటాన్‌చెరు: రెండు సంవత్సరాలకు ఒకసారి చిట్కుల్‌లో జరిగే దుర్గమ్మ జాతర, బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో రెండో రోజైన బుధవారం ఎస్ఎంఆర్ యువసేన చిట్కుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం 7 గంటలకు కాంగ్రెస్ నేత నీలం మధు నివాసం నుంచి ప్రారంభమైన ఫలహారం బండి ఊరేగింపు గ్రామ పురవీధుల మీదగా సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేక లైటింగ్, డీజే ఆకట్టుకుంది. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు చూపరులను అలరించాయి.

బోనాల ఊరేగింపు


సదాశివపేటలో బోనాల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని నంబర్ వన్ గీత పారిశ్రామిక సహకార సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతురాజులు, శివసత్తుల పూనకాలు, హైదరాబాద్ నుండి వచ్చిన కళాకారుల విన్యాసాలు, నృత్యాలు ప్రజలను ఆకర్షించాయి. నంబర్ వన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు పెద్దగౌడ్, గౌడ సంఘం సభ్యులు గడిల కృష్ణగౌడ్, శంకర్పల్లి శ్రీనివాస్, మనోహర్ గౌడ్, రఘుగౌడ్, కాశీ గౌడ్, బుదేరా కృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రూపేశ్‌ను ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మల బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా కోర్టులో సేవలు అందించాలని కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని నాగధర్, ఖానాపూర్(బి), రాంరెడ్డిపేటలో బుధవారం రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఏఈఓలు సతీష్‌కుమార్, సంతోష, కృష్ణవేణి మాట్లాడుతూ.. కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు పాసుబుక్ జిరాక్స్ ఆధార్‌కార్డు, నామిని ఆధార్ జిరాక్స్‌లు దరఖాస్తుకు జతచేసి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దాడె సాయిలు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్


తహసీల్దార్ కార్యాలయంలో అందించే సేవలపై వివరాలను అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రమైన కొండాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగే పనులు, ప్రజలకు అందించే సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలు, పెండింగ్ ఫైల్స్, భూముల రిజిస్ట్రేషన్, రికార్డుల నమోదు, తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐలు రాజు, మహదేవ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలకు వినతి


బాధిత ఫొటోగ్రాఫర్ నగేశ్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

నారాయణఖేడ్: పెళ్లి ఫొటోల డబ్బులు అడిగినందుకు నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ నగేశ్‌పై దాడిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ బాధ్యులు డిమాండ్ చేశారు. గురువారం కల్హేర్ ఏఎస్ఐ అంజయ్యకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు కాశీనాథ్‌స్వామి మాట్లాడారు. జూలై 29న బాచేపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఫొటోగ్రాఫర్ నగేశ్ పెళ్లి ఫొటోలకు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని కోరగా దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఫొటోగ్రాఫర్‌కు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు అంజి, బీరప్ప, సుధాకర్, జగన్, వీరేశం, దత్తు, అంజి, భూమేష్, గోపాల్, దిగంబర్, సాయిలు, అంజన్న, పద్మ రమేశ్ పాల్గొన్నారు.

అందరూ కలిసి మెలిసి ఉండాలి


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం

కంది(సంగారెడ్డి): కులమత భేదాలు లేకుండా అందరూ కలిసి మెలిసి జీవించాలని డిప్యూటీ తహసీల్దార్ ఎస్ మల్లేశం సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రకరణ్, ఎర్దనూర్ గ్రామాల్లో పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్లాసుల పద్ధతి పాటించ రాదన్నారు. మానవులందరూ సమానులేనని, అంటరానితనం నేరమన్నారు. దళితులపై వివక్ష చూపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గల దేవాలయాల్లో అందరూ కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల ఆనవాళ్లు ఉంటే ఎస్– న్యాబ్ 8712656777కు సమాచారం ఇవ్వాలని టీజీ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. బుధవారం జిన్నారంలోని టీజీటీడబ్ల్యూ ఆర్‌జేసీలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై సే..నో..టు డ్రగ్స్ వాల్ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా నేరాలకు అలవాటుపడిన వారి హిస్టరీ షీటర్లను ఓపెన్ చేశామని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా చేసినా, అమ్మినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలవాటుపడిన నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిన్నారం సీఐ సుధీర్ కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షిస్తామన్నారు. ప్రజలు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అత్యవసర సమయాల్లో సహాయం కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు


సంగారెడ్డిలో నిలిచిపోయిన వాహనాలు

సంగారెడ్డి టౌన్: రోజూ సాయంత్రం సమయంలో సంగారెడ్డిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనదారులు ఇష్టారాజ్యంగా వెహికిల్స్ పార్కింగ్ చేస్తుండటంతో రోడ్లపై ట్రాఫిక్ జామవుతోంది. బుధవారం సాయంత్రం బైపాస్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నిలిచిపోయాయి. బైపాస్‌లోని రిలయన్స్ స్మార్ట్ పక్కన చేపట్టిన భవన నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయడంతో వాహనదారులకు ఇబ్బందిపడుతున్నారు. అలాగే బైపాస్ నుంచి మల్కాపూర్ చింతల్, బృందావన్ కాలనీ, ప్రగతినగర్, వసంతనగర్, మంజీరా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ట్రాఫిక్ అధికారులు రోడ్లకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయకుండా, రోడ్లపై నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు బోనాల పండుగ

నారాయణఖేడ్: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో గురువారం ఆషాఢ మాసం బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శివరుద్రప్ప తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం అభిషేకం, ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

◆ సింగూరులోకి ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. పక్షం రోజులుగా డ్యాంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం డ్యాంలోకి 1,074 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. ప్రస్తుతం 14.622 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

◆ మహిళల రక్షణకే షీ–టీములు

పటాన్‌చెరు టౌన్: మహిళలను ఆదుకునేందుకు ప్రభుత్వం షీ–టీములు ఏర్పాటు చేసిందని, అత్యవసర సమయంలో వీటిని మహిళలు వినియోగించుకుని రక్షణ పొందొచ్చని పటాన్‌చెరు హెడ్ కానిస్టేబుల్ ఇస్మాయిల్ అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప్‌కింద 100–రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్ప్ లైన్ నంబర్లు (1098, 100, 181, 112, 1930) గురించి అవగాహన కల్పించారు.

◆ సీసీ కెమెరాలు తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగ పడుతాయని తెలిపారు. ప్రతీ వ్యాపారి కెమెరాలు పెట్టుకోవాలని సూచించారు. కాగా, సిర్గాపూర్ లోంక తండాకు చెందిన నేనవత్ పండరికి తాను పోగొట్టు ఫోన్‌ను అప్పగించారు.

◆ పూడికతీత పనులు



మునిపల్లి(అందోల్): మురుగు కాలువలలో పూడికతీత పనులు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. బుధవారం మండలంలోని మగ్దుంపల్లిలో ఆయా కాలనీల్లో మురుగు కాలువల్లో పూడికతీత పనులు నిర్వహించారు. కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించామన్నారు. కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

◆ మేయర్‌కు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్ వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లో ఉన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, సతీశ్‌లు పాల్గొన్నారు.

◆ మల్గిలో ఇషాన్‌రెడ్డి వర్ధంతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గిలో తెలంగాణ అమర వీరుడు ఇషాన్‌రెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. మండల పరిధిలోని బసంత్‌పూర్‌కు చెందిన ఇషాన్‌రెడ్డి తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన విషయం తెలిసిందే. మారుతి యాదవ్, శ్రీపతి, సిద్దారెడ్డి, మానిక్‌సాగర్, నగేష్, సాయినాథ్ పాల్గొన్నారు.

◆ సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్ : ఉద్యోగ, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీకి వెళ్తున్న వారిని ముందుగా అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎం నాయకులు యాదగిరి, సాయిలు, కృష్ణ పాల్గొన్నారు.

◆ అవగాహన అవసరం

మునిపల్లి(అందోల్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ హరినందన్ రావు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, తాగు నీటి సరఫరా, మొక్కల పెంపకంపై అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

◆ రోడ్లకు మరమ్మతులు చేయాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీ బాటలో భాగంగా బుధవారం దత్తగిరి కాలనీ, వసంత్ విహార్, ఆదర్శనగర్ తదితర కాలనీల్లో పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి ప్రజల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల నుంచి పట్టణంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీమోద్దీన్, రాజు, నారాయణ, నరేశ్, శివరామారావు, నరేశ్, ముతబీర్‌లు ఉన్నారు.

◆ పనుల పర్యవేక్షణ

జహీరాబాద్: పట్టణంలో 65వ జాతీయ రహదారిపై సిబ్బంది చేస్తున్న పనులను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. బుధవారం సిబ్బంది చేస్తున్న పనులను దగ్గరుండి పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండేలా పనులు చేయాలని సిబ్బందికి సూచించారు.

◆ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేటలో టీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్: జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు, 2024–25 సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయ, వర్గల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి ఎస్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ లోగా www. navodaya. gov. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 73823–35164, 94489–01318, 99215–55310 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ ఎల్.శైలజ బుధవారం తెలిపారు. 7, 8 ,9వ తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో కూడా అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

◆ ఇంటి నంబర్లు కేటాయించాలి

ఝరాసంగం(జహీరాబాద్): గత 30 సంవత్సరాలుగా ఇళ్లలో నివాసం ఉంటున్న తమకు ఇంటి నంబర్లు కేటాయించాలని మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తమ ఇళ్లలో నివాసముంటున్నప్పటికీ పంచాయతీ రికార్డులలో నమోదు చేయలేకపోయారన్నారు. పన్నులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు.

◆ పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట

పటాన్‌చెరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులకు బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు సూచించారు. బుధవారం పారిశుద్ధ్య పనులు పరిశీలనలో భాగంగా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును ఆమె తెలుసుకున్నారు.